

ల్యాండ్ మాఫియాపై ఉక్కుపాదం

విచారణకు ఏసీపీ నేతృత్వంలో ప్రత్యేక విభాగం

సీపీ మొహంతి చర్యలతో బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఖాళీగా ఉన్న ప్లాట్లు కనిపిస్తే చాలు రాత్రికి రాత్రి వాటికి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమించుకోవడం.. భూమి యజమాని వస్తే తమకున్న రాజకీయ అండతో బెదిరించడం.. దిక్కున్నచోట చెప్పుకోమనడం.. ఒకేస్థలాన్ని పలువురికి రిజిస్టర్ చేసి సొమ్ము చేసుకోవడం.. కబ్జా చేయడానికి ఎన్ని మార్గాలుంటే అన్ని మార్గాలను అనుసరిస్తూ కరీంనగర్‌లో ల్యాండ్ మాఫియా విస్తరించి విశ్వరూపం చూపిస్తున్నది. వందల మంది బాధితులు నాయకుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే వారు లేక పోవడంతో ల్యాండ్ మాఫియా చెలరేగిపోయింది. కోట్లాది రూపాయలు చెల్లించి మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలు కొన్న భూములు కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి చేరిపోయాయి. ఐదేళ్లుగా ఈ ల్యాండ్ మాఫియా విస్తరించి కరీంనగర్‌లోని భూములను మింగేసింది. నాయకుల వద్దకు వెళితే సెటిల్‌మెంట్ చేసుకోమని సలహాలు ఇవ్వడం, పోలీసుల వద్దకు వెళితే సివిల్ పంచాయతీల్లో తలదూర్చబోమని చెప్పి చేతులు దులుపుకోవడం మినహా బాధితులకు న్యాయం జరగలేదు. అధికార పార్టీకి చెందిన నేతలు, వారి అండదండలు ఉన్నవారితోపాటు అన్ని రాజకీయ పార్టీలకు చెందిన వారు ఈ మాఫియాలో పాత్రదారులు కావడంతో పోలీసులు కూడా పట్టించుకోలేదనే విమర్శలు వచ్చాయి. ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. పోలీసులు భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో భూదందాలతోపాటు ఇతర అక్రమ దందాలను నడిపిస్తున్న మాఫియాపై పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి కొరడా ఝుళిపించారు.

● భూముల ధరలు పెరగడంతో..

కరీంనగర్ నలుదిశలా శరవేగంగా విస్తరించడంతోపాటు స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకోవడంతో నివేశన, వాణిజ్య స్థలాల ధరలు అమాంతం ఆకాశానికి చేరుకున్నాయి. జిల్లా విస్తీర్ణంలో సగానికిపైగా శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోకి చేర్చడంతో నివేశన స్థలాలతోపాటు వ్యవసాయ భూముల ధరలు సామాన్యులకు అందకుండా పోయాయి. దీంతో ల్యాండ్ మాఫియా కళ్లు ఖాళీ స్థలాలపై పడ్డాయి. కరీంనగర్‌తోపాటు నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల డివిజన్లలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు.. ఎలాగైనా వాటిని కబ్జా చేయాలనే ఆలోచనతో భూ కబ్జాదారులు ఆక్రమణలపై దృష్టి సారించారు ప్రజా ప్రతినిధుల అండదండలతోనే కబ్జాదారులు పెట్రేగిపోతుండడంతో నిత్యం ఏదో ఒక చోట స్థలయజమానులు తమ ప్లాట్లను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారనో లేక ఇల్లు కట్టుకోనివ్వడం లేదనో, తన ప్లాట్లలోకి చొచ్చుకొని వచ్చి తనకు తెలియకుండా ప్లాట్‌ను చదను చేసి ఆక్రమించారనో ఫిర్యాదులతో పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పలుకుబడి కలిగిన ప్రజా ప్రతినిధుల అండదండలతో లోకల్ లీడర్లే మాఫియాగా మారుతుండడంతో పోలీసులు నామమాత్రంగా కేసులు పెట్టి చేతులు దులుపుకుంటున్నారని, దీంతో మాఫియా ఆగడాలు రోజురోజుకు పెరుగుతున్నాయనే ఆరోపణలు గతంలో వెల్లువెత్తాయి. భూకబ్జాదారులు తమకున్న పరిచయాలతో, అనుభవంతో తప్పుడు కాగితాలు సృష్టించి దొంగ రిజిస్ట్రేషన్లను చేయించుకుని ఆ భూములను కబ్జా చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎలాంటి వివాదాలు లేని స్థలాలకు కూడా కొన్ని స్థానిక ముఠాలు కావాలని వివాదాలను సృష్టించి వారి వద్దకు వచ్చేలా చేసుకుని బెదిరింపులకు పాల్పడుతూ అడ్డగోలుగా ఆ స్థలం విలువలో పావు వంతు విలువకే కాజేస్తున్నారు. మరికొన్ని సంఘటనల్లో బెదిరించి బలవతంగా 10 లక్షల నుంచి 20 లక్షలు తీసుకుని సెటిల్‌మెంట్ చేస్తున్నారు. బాధితులు ధైర్యంగా బయటకు చెప్పుకోలేక పోయారు. ఈ భూకబ్జా దందాల్లో కొందరు లీడర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉండడమే ఇందుకు కారణం.

● అక్రమాల కట్టడికి ప్రత్యేక చర్యలు

ల్యాండ్ మాఫియాతో మోసాలకు గురైన బాధితులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించి న్యాయం చేయాలంటూ మొరపెట్టుకుంటున్నారు. భూ కబ్జాదారులను గుర్తించిన సీపీ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్‌ను ఏర్పాటు చేశారు. రెండు వారాలుగా ఈ విభాగం బాధితుల ఫిర్యాదులపై లోతుగా విచారణ చేపట్టి నిందితులను గుర్తించింది. వీరిపై చర్యలకు ఉపక్రమించింది. ఏసీపీతోపాటు ఇద్దరు సీఐలు, ఎస్ఐ, ఇతర సిబ్బందిని ఈ విభాగానికి కేటాయించారు. వీరు భూకబ్జాదారులపై చర్యలకు ఉపక్రమించారు. ఇసుక మాఫి యా కట్టడికి సాట్ (స్పెషల్ యాక్షన్ టీం)ను ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్ల, లారీలను సీజ్ చేసి డ్రైవర్, యజమానులపై కేసులు నమోదు చేశారు. దీంతో కరీంనగర్‌లో ఇసుక అక్రమ రవాణా కొంతమేరకు నియంత్రణలోకి వచ్చింది. తాజాగా భూఆక్రమణలు, కబ్జాలకు పాల్పడుతున్న మాఫియాపై చర్యలకు పోలీస్‌కమిషనర్ ఉపక్రమించారు.

● నకిలీ పత్రాలతో భూ వివాదాలు

ఈ ల్యాండ్ మాఫియా ఖాళీ స్థలాలను, చిన్నపాటి వివాదం ఉన్న స్థలాలను గుర్తించి వాటికి సంబంధించిన పత్రాలను చూసి నకిలీ పత్రాలను తయారు చేస్తుంటారు. అందుకుగాను నకిలీ స్టాంపులు కూడా తయారు చేస్తున్నారంటే ఈ ముఠా ఆగడాలు అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి నేరాలకు పాల్పడిన కొందరిని గతంలో కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేసి పీడీ యాక్టు కూడా నమోదు చేశారు. ఈ నకిలీ పత్రాల ఆధారంగా కోర్టు దావా దాఖలు చేసి ఆ భూమిపై వివాదం ఉందంటూ తెరమీదకు తీసుకువస్తారు. అప్పటి నుంచి భూమి యజమానులకు తిప్పలు తప్పవు. ఇతర ప్రాంతాలకు చెందిన వారైతే వారిని బెదిరించడం, వారి స్థలంలోనే షెడ్లు నిర్మించడం వంటి కార్యకలాపాలకు పాల్పడడంతో వారి బారిన పడిన కొందరు సొంత భూములను కూడా వదులుకుంటున్నారు.

● హత్యలకు దారితీస్తున్న భూ వివాదాలు...

భూ వివాదాలు తీవ్రమైన సందర్భాలలో హత్యలకు దారితీస్తూ శాంతిభద్రతల సమస్యను సృష్టిస్తున్నది. గతంలో కరీంనగర్‌లో పలు సంఘటనలు జరిగాయి. రియల్‌ఎస్టేట్ వ్యాపారులు తీగలగుట్టపల్లిలో మూల కిషన్‌రెడ్డి, ఆదర్శనగర్‌లో షౌకత్ అలీ, రేకుర్తిలో మేన్నేని కిషన్‌రావు హత్య కు గురయ్యారు. 2006 నవంబరులో నగర శివారులోని తీగలగుట్టపల్లెకు చెందిన మూల కిషన్‌రెడ్డిని ల్యాండ్ మాఫియాకు సంబంధించిన కిరాయి ముఠా కంట్రీమేడ్ తపంచాతో అతని ఇంటి వద్దనే కాల్చి చంపింది. 2010లో ఆదర్శనగర్ ప్రాంతానికి చెందిన షౌకత్ అలీని దుండగులు దారి కాచి గొడ్డళ్లతో నరికి హత్య చేశారు. ఆ తరువాత కూడా పలు సంఘటనల్లో భూమాఫియా ముఠాలు చాలా మందిపై దాడులు చేయటం, బెదిరింపులకు, కిడ్నాప్‌లకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

భగత్‌నగర్‌కాలనీలో ఓ సింగరేణి రిటైర్డు ఉద్యోగి స్థలాన్ని కబ్జా చేయడమే కాకుండా ఆయనకు మద్దతిచ్చిన పొరిగింటి వ్యక్తిపై అక్రమ కేసు పెట్టించారు. ఈ ఘటన వెనుక అప్పటి అధికారపార్టీకి చెందిన కార్పొరేటర్ ఉన్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన సీతారాంపూర్ ప్రాంతంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మూడు ఇళ్లను మున్సిపల్ అనుమతి తీసుకొని నిర్మించుకున్నారు. స్లాబ్ దశలో ఉండగా ఆ డివిజన్ కార్పొరేటర్, అతని అనుచరులు అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఇలాంటి సంఘటనలు నగరంలో కోకొల్లలుగా జరిగాయి.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొందరు కార్పొరేటర్లు, వారి అనుచరుల దౌర్జన్యం, అరాచకాలు పెరిగాయని, ఇల్లు నిర్మించుకుంటే వారు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే నిర్మాణాలను అడ్డుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండి ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉండాల్సిన ప్రజాప్రతినిధే ఏకంగా చట్టాన్ని చేతులోకి తీసుకుని కూల్చివేతలకు, దౌర్జన్యాలకు, భూకబ్జాలకు పాల్పడిన ఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

2019 ఏప్రిల్ 25న కరీంనగర్‌లోని రామచంద్రాపూర్ కాలనీలో సర్వే నంబర్ 965లో రెండు గుంటల స్థలంలో యజమాని శ్రీనివాస్ రెడ్డి తన కుటుంబ సభ్యులతోకలిసి నిర్మాణ పనులు చేస్తుండగా ఆ భూమిపై కన్నేసిన భూ మాఫియాకు చెందిన నలుగురు శ్రీనివాస్‌రెడ్డిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డువచ్చిన కుటుంబ సభ్యులపైనా దాడి చేశారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం 2019 మే 7న నిందితులపై పీడీ యాక్టు అమలు చేసి కటకటాల్లోకి పంపించారు. ఆ తరువాత కొంతకాలంపాటు భూ మాఫియా ఆగడాలు కొంత తగ్గినప్పటికీ ఇటీవల మళ్లీ పెరిగాయి. నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల డివిజన్లలో భూమాఫియా అరాచకాలు భరించలేక పోతున్నా మని ఆయా ప్రాంతాల వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఎక్కడ చూసినా గుంట నివేశన స్థలం 20 లక్షలకు పైబడి విలువ చేస్తుండడంతో అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా చిన్న ప్లాట్ల నుంచి మొదలుకొని రోడ్లు, పార్కు స్థలాలే కాకుండా ప్రైవేట్ భూముల కబ్జా వ్యవహారాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. విద్యానగర్, భగత్ నగర్, రాంచంద్రాపూర్ కాలనీ, హౌజింగ్‌బోర్డ్ కాలనీ, నగర శివారు ప్రాంతం రేకుర్తి, తీగలగుట్టపల్లి, కొత్తపల్లి, చింతకుంట, సీతారాంపూర్, బొమ్మకల్, మల్కాపూర్, లక్ష్మీపూర్ తదితర ప్రాంతాల్లో భూ వివాదాలు అధికమయ్యాయి. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఠాణాలకు నిత్యం పదుల సంఖ్యలో భూ వివాదాల ఫిర్యాదులు అందుతున్నాయి.

భూ కబ్జాకు పాల్పడిన కార్పొరేటర్, రియల్టర్ అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 17: భూకబ్జాకు పాల్పడిన కరీంనగర్ 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావును బుధవారం ఒకటో ఠాణా పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ భగత్‌నగర్‌లోని కొత్త రాజిరెడ్డి అనే వ్యక్తి మున్సిపల్ అనుమతితో ఇంటి నిర్మాణం చేపడుతుండగా గంగాధరకు చెందిన చీటి రామారావు, కార్పొరేటర్ తోట రాములు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో రాజిరెడ్డి డిసెంబరు 20న కరీంనగర్ వన్‌టౌన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో ఇద్దరు వ్యక్తులు ఇంటి స్థలాన్ని ఆక్రమించేందుకు ఉద్దేశపూర్వకంగా ఇంటినిర్మాణం అడ్డుకున్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఇంటి స్థలం హద్దులు మార్చి, తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారని తెలిపారు. కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ సహాయంతో హైదరాబాద్, విశాఖపట్నంకు వెళ్లి లోతుగా విచారణ చేపట్టి ఆధారాలు సేకరించామని పోలీసులు తెలిపారు. ఇప్పటి వరకు సేకరించిన ఆధారాల మేరకు ఇద్దరు వ్యక్తులపై ఐపీసీ 120బి, 447, 427, 465, 467, 468, 471 రెడ్‌విత్ 34 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. తోటరాములు, చీటి రామారావులను బుధవారం అరెస్టు చేసి కరీంనగర్ సెకండ్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈ నెల 31 వరకు రిమాండ్ విధించినట్లు తెలిపారు.



కార్పొరేటర్ తోట రాములును అరెస్టు చేసి కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

బీఆర్ఎస్‌కు ఆకారపు భాస్కర్‌రెడ్డి రాజీనామా

సుభాష్‌నగర్, జనవరి 17: బీఆర్ఎస్ నాయకుడు ఆకారపు భాస్కర్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం బీఆర్ఎస్ పార్టీలో చేరానని తెలిపారు. ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం తనను నిర్లక్ష్యం చేసిందని, ప్రోత్సహించకుండా అవమానాలకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలకు అందుబాటులో లేకుండా అనేక ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. అందుకే బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు. సమావేశంలో వాసాల రవీందర్, ఎంఏ కరీం, ఎండీ ఆసిఫ్, తాళ్లపల్లి అంజయ్య, ఎండీ సలీం, ఎండీ ఖదీర్, ఎండీసయ్యద్‌గౌస్, ఎంఏ నయీం, కె జగన్‌రెడ్డి, ఎండీ ఖుర్షీద్ అలీ, ఎంఏ రహమాన్, ఎండీ తహసీన్, కాసారపు ఎల్లయ్య, సయ్యద్‌ఖాజా గౌసుద్దీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆకారపు భాస్కర్‌రెడ్డి

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 17: గత అక్టోబరులో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్, హెడ్మాస్టరను సబ్‌స్టిట్యూట్ లేకపోవడంతో రిలీవ్ చేయలేదని, అలాంటి వారందరిని వెంటనే ప్రభుత్వం రిలీవ్ చేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు బుధవారం కరీంనగర్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్, జిల్లా నాయకులు గిరి సురేశ్, శంకర్‌నాయక్, శ్రీనివాస్, రమేశ్‌నాయక్, శోభన్‌బాబు కలిశారుచ ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులు వారు కోరుకున్న స్థానాలకు బదిలీ అయినప్పటికీ రిలీవ్ కాక పోవడంతో మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. జీవో 342ను అనుసరించి ఉన్నత చదువులకు అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని వారు హర్షవర్ధన్‌రెడ్డిని కోరారు.

సంక్షోభంలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎంపీ బండి సంజయ్ బహిరంగ లేఖ

కరీంనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంక్షోభంలో ఉన్న చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం బహిరంగ లేఖ రాశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో వస్త్ర పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్న ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత రంగంపై ఆధార పడ్డ 20 వేల మంది కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి వ్యయం పెరగడంతో పాలిస్టర్ బట్టకు గిట్టుబాటు ధర, సరైన మార్కెట్ లేక పోవడంతో సిరిసిల్లలో సాంచాలను బంద్ పెట్టారన్నారు. సిరిసిల్ల సంక్షోభానికి ప్రధానకారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వంతోపాటు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలేనన్నారు. ఏడేళ్లుగా ప్రభుత్వ ఆర్డర్లపైనే ఆధారపడి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మనుగడ సాగిస్తున్నదన్నారు. బతుకమ్మ చీరల బకాయిల సొమ్ము 220 కోట్ల రూపాయలను ప్రభుత్వం చెల్లించక పోవడం వల్లనే ఈ దుస్థితి వచ్చిందన్నారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే బతుకమ్మ చీరల బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రత్యేక చొరవ తీసుకుని భారీగా ప్రభుత్వ ఆర్డర్లను ఇచ్చి సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకోవాలన్నారు. వర్కర్ టు ఓనర్ పథకానికి నిధులు మంజూరు చేసి సంపూర్ణంగా అమలు చేయాలన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల ఆధునీకరణకు అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపితే కేంద్రం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకోవాలని లేఖలో కోరారు.

గుడిసెలు వేసుకున్న వారిపై కేసులు ఎత్తివేయాలి

● సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు నాగయ్య

భగత్‌నగర్, జనవరి 17: జగిత్యాలలో గుడిసెలు వేసుకున్న వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు జి నాగయ్య డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాలలో ఆరునెలలుగా సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరుపేదలు ప్రభుత్వ భూములల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారన్నారు. గతంలో ఈ భూమి ఎవరికీ కేటాయించలేదన్నారు. ఇలాంటి స్థలంలో పేదలను సమీకరించి గుడిసెలు వస్తే తప్పా అని ప్రశ్నించారు. గత పాలకులు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని మోసం చేయడంతోనే ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పోలీసులు పేదలు నిర్మించుకున్న గుడిసెలను కూల్చివేయడం శోచనీయమన్నారు. సీపీఎం నాయకులు, అమాయకులైన పేదలపైన కేసులు పెట్టి జైలులో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో 69 భూ కేంద్రాల్లో పోరాటం చేస్తున్నామని, గతంలో సీఎం రేవంత్‌రెడ్డిని సీపీఎం బృందం కలిసి పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినితి పత్రం సమర్పించామన్నారు. జగిత్యాల పోలీసులు అత్యుత్సాహంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ముకాస్తూ పేదలు అక్రమించుకున్న భూములపై దౌర్జన్యంగా వ్యవహరించారన్నారు. 307 లాంటి అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన 11 మందిని తక్షణమే విడుదల చేయాలన్నారు. లేని పక్షంలో ప్రజా సంఘాలను ఐక్యం చేసి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల రమేష్, డి నరేష్‌పటేల్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ కమిటీ సభ్యుడు జి నాగయ్య

పశు వైద్యాధికారులకు ప్రత్యేక శిక్షణ

సుభాష్‌నగర్, జనవరి 17: పాడి పశువుల పునరుత్పత్తి పెరుగుదల(అప్ గ్రేడేషన్ ఆఫ్ గైనకలాజికల్ స్కిల్స్ ఇన్ బొవైన్స్)పై పశు వైద్యాధికారులకు పది రోజుల శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం లింగారెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు లాభనష్టాలను ప్రభావితం చేసే అంశాల్లో పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలు, అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో పశు వైద్యాధికారులుపాడి పశువుల పునరుత్తత్తి సమస్యలపై విస్తారమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. వాటి పరిష్కారాలకు తగిన సాంకేతిక నైపుణ్యత చాలా అవసరమన్నారు. ఇందుకు కోసం కార్యాచరణ రూపొందించిందని, అందుకు కావలసిన ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. పది రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో ఆరు రోజులు సంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తారని, మూడు రోజులు క్షేత్రస్థాయిలో పాడి పశువులు ఎక్కువగా ఉండే గ్రామాలను సందర్శిస్తారని తెలిపారు. ఆయా గ్రామాల రైతుల పశువులకు అప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి తగిన మందులను పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం జిల్లా కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జయరాములు, ప్రత్యేక బోధనా నిపుణులు డాక్టర్ జీవికే శర్మ, డాక్టర్ ఎస్‌పీ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం కోటేశ్వర్‌రావు, డాక్టర్ సాయి చైతన్య, డాక్టర్ దివ్య పాల్గొన్నారు.

పని చేయని నిఘా నేత్రం

- రాజీవ్ రహదారిపై పని చేయని సీసీ కెమెరాలు
- తిమ్మాపూర్ మండలవ్యాప్తంగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తిమ్మాపూర్, జనవరి 17: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని నిత్యం పోలీసు అధికారులు చెబుతుంటారు. దానికి తగ్గట్టు ప్రజా ప్రతినిధులు, దాతలు, వ్యాపారులు, గ్రామస్థుల సహ యంలో మండలంలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్ళు, ముఖ్యమైనా ప్రదేశాల్లో గతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి నిర్వహణను పట్టించుకోక పోవడంతో అవి పని చేయడం లేదు.

● మండలవ్యాప్తంగా 300కు పైగా సీసీ కెమెరాలు

మండల వ్యాప్తంగా 300 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మొదట్లో బాగానే పని చేసినా వాటి పర్యవేక్షణకు నిధులు, ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు పని చేయడం లేదు. దీంతో ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఎటువంటి సాక్షాలు లభించక ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

● రాజీవ్ రహదారిపై ..

గ్రామాల పరిస్థితి ఇలా ఉంటే కరీంనగర్ - హైదారాబాద్ రాజీవ్ రహదారిపై పరిస్థితి అధ్వానంగా తయారైంది. రాజీవ్ రహదారిని ఆనుకుని అలుగునూర్, మహాత్మానగర్, తిమ్మాపూర్, రామకృష్ణకాలనీ, ఇందిరానగర్, నుస్తులాపూర్, కొత్తపల్లి, రేణికుంట గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల వద్ద రాజీవ్ రహదారిపై లక్షల రూపాయలు ఖర్చు చేసి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఒకటి, రెండు తప్ప మిగతావి పని చేయడం లేదు. రహదారిపై ప్రతిరోజు పెద్ద ఎత్తున వాహనాలు తిరుగుతుంటాయి. ఎప్పుడు రద్దిగా ఉండే రహదారిపై ప్రతిరోజు ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. సీసీ కెమెరాలు పని చేయకపో వడంతో ప్రమాదాలు జరిగిన సమయాల్లో పోలీసులకు ఎటువంటి సాక్షాలు లభించడం లేదు.



మహత్మానగర్ గ్రామం రాజీవ్ రహదారిపై పనిచేయని సీసీ కెమెరాలు

● పెరుగుతున్న చోరీలు

మండలంలో ఇటీవల దొంగతనాలు పెరుగుతు న్నాయి. ఈనెల 8న ఎల్ఎండీ కాలనీ ఇరిగేషన్ సర్కిల్-2, డివిజన్ నం.5 కార్యాలయంలో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు నాలుగు సీపీయూలు, ఐదు మాని టర్లు, రెండు ప్రింటర్లు ఎత్తుకెళ్ళారు. కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయడం లేదు. చుట్టు పక్క ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు కూడా పనిచేయడం లేదు. దీంతో ఎటువంటి ఆధారాలు లభించలేదు. రామకృష్ణ కాలనీలో గల అంగారిక టౌన్‌షిప్‌లో మూడు రోజుల క్రితం చోరీ జరిగింది. దొంగలు 20 విద్యుత్ స్తంభాలపైకి ఎక్కి సుమారు 55 చదరపు మీటర్ల (సుమారు 450కిలోలు) అల్యూ మీని యం వైర్లు కట్ చేసుకుని ఎత్తుకెళ్ళా రు. ఈ సంఘటనపై ఎల్ఎండీ పోలీ సులు విచారణ చేపడు తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



నుస్తులాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై పనిచేయని సీసీ కెమెరాలు

ఉపాధ్యాయుల సమస్యలకు త్వరలో పరిష్కారం

- పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జనవరి 17: ఉపాధ్యాయుల సమస్యలు త్వరలోనే పరిష్కారం అవుతాయని పీఆర్‌టీయూటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, టిపిసిసి అధికారప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఫిలింభవన్‌లో పీఆర్‌టీయూటీ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను కొత్తగా తయారు చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు 57/4, 57/5 మెమోను అమలు చేయాలని, పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఎస్‌జీటీ, ఎస్‌ఏలకు వేతన వ్యత్యాసాలను తగ్గించాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీలకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మంచిరెడ్డి అనంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ ఉపాధ్యక్షులు కేతిరి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మక్కపేట శివారులో చిరుత పులుల సంచారం

ఇబ్రహీంపట్నం, జనవరి 18: మండలంలోని అమ్మక్కపేట గ్రామ శివారులోని వ్యవసాయ భూములలో, చెరుకు తోటలలో చిరుత పులుల సంచారం కలకలం రేపుతోంది. గ్రామ శివారులోని అటవీ ప్రాంతం వెంబడి, వ్యవసాయ తోటలలో రెండు రోజుల నుంచి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఓ రైతుకు చెందిన తోటల నుంచి పులులు వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులకు గ్రామస్థులు సమాచారం అందించారు. ఎఫ్ఆర్‌ఓ షౌకత్ అలీ అక్కడకు చేరుకుని చిరుత పులి పగ్ మార్కును(అడుగులు) పరిశీలించారు. అటవీ ప్రాంతంలో, పరిసర ప్రాంతంలో పూర్తి నిఘా పెడుతున్నట్లు షౌకత్ అలీ తెలిపారు. అనుమానిత ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత పది రోజుల క్రితమే పక్కన ఉన్న సత్యక్కపల్లె గ్రామంలో సంచరించిన పులి అమ్మక్కపేట గ్రామ శివారుకు వచ్చి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 39మంది రైతులు 422 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు పది క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,200 చెల్లించారు.

ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 17: ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన వృద్ధుడు గూడ రాజిరెడ్డి(90) కల్వర్టు పైనుంచి పడి ప్రమాదవశాత్తు మృతి చెందాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుపై కూర్చున్న రాజిరెడ్డి ప్రమాదవశాత్తు కింద పడడంతో గాయాలతో చనిపోయాడు. మృతుడి కొడుకు అంజిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి పెట్టండి

» అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి దిశానిర్దేశం



హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయ వనరుల సమీకరణపై దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పరిశ్రమలు, గనులు, గృహ నిర్మాణం, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ విభాగాల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారీగా పెండింగ్ బకాయిలపై చర్చించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు విక్రయించిన భూములు, వచ్చిన ఆదాయం, పెండింగ్ బకాయిల మీద సమగ్ర సమీక్ష చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ప్రతిపైసా వదలొద్దని అధికారులకు సూచించారు. పారిశ్రామిక పార్కులను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తూప్రాన్‌లో పరిశ్రమల కోసం 325 ఎకరాలు ప్రభుత్వం కేటాయించగా ఇప్పటి వరకు 139 ఎకరాలే సేకరించారని, మిగిలిన భూమిని సత్వరమే సేకరించాలని ఆయన ఆదేశించారు. పరిశ్రమల శాఖ పరిధిలో జాయింట్ వెంచర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయ వనరులపై ఆరా తీశారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో 12 జాయింట్ వెంచర్ ప్రాజెక్టులల్లో ఆరు ప్రాజెక్టులు పూర్తయ్యాయని, వాటి నుంచి రూ.955 కోట్లు ప్రభుత్వానికి రావాల్సి ఉండగా రూ.430 కోట్లు వచ్చాయని అధికారులు తెలిపారు. రూ.525 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే మైనింగ్ శాఖలో రావాల్సిన ఆదాయంపై భట్టి, అధికారులను అడిగి తెలుసుకున్నారు.

దిద్దుబాటు చర్యలకు శ్రీకారం!

» ఔటర్ భూముల ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఘట్‌కేసర్, జనవరి 17: ఘట్‌కేసర్ మండలంలో ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) నిర్మాణం కోసం సేకరించిన భూముల ఆక్రమణలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ భూ ఆక్రమణలపై 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల ప్రచురితమైన 'దోస్తుకు సర్వీస్, ఔటర్‌లో చీటర్స్, మృతుడి పేర పట్టాదారు పాసుపుస్తకాలు' వంటి వరుస ప్రత్యేక కథనాలకు స్పందించి దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ బుధవారం పలు మండలాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓఆర్ఆర్ కోసం సేకరించిన భూమి ఎంత ? ఆ భూమి వివరాలు ధరణిలో నమోదయ్యాయా? అనే అంశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హెచ్ఎండీఏ సేకరించిన భూమి వివరాలను పరిశీలించి ఎక్కడైనా ధరణిలో నమోదు కాకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. భూములు కోల్పోయిన వారు పరిహారం తీసుకోకుండా కోర్టులో డిపాజిట్ అయిన వారి వివరాలను కూడా ధరణిలో పొందుపర్చాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలు రికార్డుల్లో ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఘట్‌కేసర్ మండలం పడమటిసాయిగూడలో 7.30ఎకరాల భూమిని ఔటర్ కోసం సేకరించగా పరిహారం కూడా చెల్లించారు. అయినా అందులో 5.08ఎకరాలకు మృతి చెందిన వ్యక్తి పేర పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు మృతుడి పేర జారీ అయిన పట్టాదారు పేరున ఉన్న భూమిని ధరణి పోర్టల్‌లో ఔటర్ భూమి అని రికార్డులు సవరించారు.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్

పంజాగుట్ట, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. డిసెంబరు 23న ప్రజాభవన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో పంజాగుట్ట పోలీసులు షకీల్ పేరును ఎఫ్ఐఆర్, నిందితుల రిమాండ్ రిపోర్టులో చేర్చారు. ప్రమాదానికి కారణమైన షకీల్ కుమారుడు సాహిల్ అలియాస్ రాహిల్ దుబాయ్ పారిపోయేందుకు షకీల్ సహకరించారని పోలీసుల అభియోగం. సాహిల్ దుబాయ్ పారిపోయేందుకు మొత్తం పది మంది సాయపడ్డారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో షకీల్ ఇంట్లో పని చేసే అర్బాజ్(25), కారు డ్రైవర్ సొహైల్(26) ఉన్నారు. ఇక, మాజీ ఎమ్మెల్యే షకీల్, జకీయా, షాహిద్‌పై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేసిన పోలీసులు ఖలీల్, షర్ఫుద్దీన్, అస్లాం అనే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు.

పారదర్శకంగా మెడికల్ బోర్డు ఫిట్‌నెస్ పరీక్ష

» మోసగాళ్లను నమ్మకండి: సింగరేణి సీఎండీ

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో డ్యూటీలు చేయలేని సింగరేణి ఉద్యోగుల కోసం మెడికల్ బోర్డు చేపట్టే ఫిట్‌నెస్ పరీక్ష అత్యంత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహిస్తున్నామని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ బోర్డులో నిపుణులైన వైద్యులు పరీక్షించి, నిబంధనల ప్రకారం అనారోగ్యులైన ఉద్యోగులను అన్ ఫిట్ చేస్తారని అన్నారు. వారి స్థానంలో కారుణ్య నియామకాలను వెంటనే చేపడుతున్నామని తెలిపారు. అన్ ఫిట్ చేయిస్తామనే మోసగాళ్ల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని.. అలాంటి వారి పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని కార్మికులకు సూచించారు.

బీజేపీ సర్కార్ వైఫల్యాలపై 'యంగ్ ఇండియా కీ బోల్'

» వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'యంగ్ ఇండియా కీ బోల్ సీజన్-4'ను ప్రారంభిస్తున్నట్టు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివసేన రెడ్డి తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం శివసేన రెడ్డి యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి 'యంగ్ ఇండియా కీ బోల్-సీజన్-4' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా యంగ్ ఇండియా కీ బోల్ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రాష్ట్రానికి ఆరుగురు ఐపీఎస్‌ల కేటాయింపు

» ఇందులో ఇద్దరు తెలంగాణవారే

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఆరుగురు కొత్త ఐపీఎస్(ఇండియన్ పోలీస్ సర్వీస్) అధికారులను కేటాయించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈ అధికారులను తెలంగాణ కేడర్‌కు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ అండర్ సెక్రటరీ అంజన్ సర్కార్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మొత్తం 200 మంది ఐపీఎస్ అధికారులను వివిధ రాష్ట్రాలకు కేటాయించారు. ఇందులో తెలంగాణకు కేటాయించిన ఆరుగురు ఐపీఎస్‌లలో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు కాగా.. మిగతా నలుగురు ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారు. జనరల్ కేటగిరీ కింద అయేషా ఫాతిమా(సొంత రాష్ట్రం మధ్యప్రదేశ్), మంధారె సోహమ్ సునీల్(మహారాష్ట్ర), మనన్ భట్(జమ్మూకశ్మీర్), ఓబీసీ కేటగిరీ కింద పత్తిపాక సాయికిరణ్(తెలంగాణ), రాహుల్ కాంత్(జార్ఖండ్), రిత్విక్ సాయి కొట్టె(తెలంగాణ)లను రాష్ట్రానికి కేటాయించారు. కాగా.. తెలంగాణకు చెందిన అనుగు శివ మారుతిరెడ్డిని ఒడిసాకు, రావుల జయసింహారెడ్డిని వెస్ట్ బెంగాల్‌కు, ఎస్.దీప్తి చౌహాన్‌ను ఉత్తరప్రదేశ్‌కు కేటాయించారు.

7 టీఎంసీలతో మల్లన్నసాగర్ కడితే సరిపోయేది

» టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సిద్దిపేట అర్బన్, జనవరి 17: మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై పూర్తి విచారణ జరిపించాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం రంగాధాంపల్లి అమరవీరుల స్థూపం సమీపంలో ఆయన మాట్లాడారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు అక్కడ అవసరం లేదని చెప్పినా గత ప్రభుత్వం వినలేదని పేర్కొన్నారు. రిజర్వాయర్‌లో అన్ని టీఎంసీల నీళ్లు ఉండే అవకాశం లేనందున 7 నుంచి 8 టీఎంసీలు ఉంటే బాగుంటుందని కూడా సూచించామన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పూర్తి ప్యాకేజీ ఇంకా రాలేదని, దానిని వెంటనే చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని అన్నారు. తనకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఇస్తానని హామీ కూడా ఇచ్చిందని తెలిపారు.

భూకబ్జాదారులు 3 నెలల్లో జైలుకే

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టీకరణ

నల్లగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భూ కబ్జాలు చేసిన వారిని రెండు మూడు నెలల్లో జైలుకు పంపుతామని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ఆక్రమణపై 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై మంత్రి స్పందించారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ 'కూల్‌గా కబ్జా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని చూపించి, అభినందించారు. హైదరాబాద్‌లోని ఖాజాగూడ పెద్దచెరువు ప్రభుత్వ భూముల్లో కొండలను తవ్వి విల్లాలకు రోడ్డు నిర్మిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు ఆపించాలని, బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బుధవారం సాయంత్రంలోగా నిర్మాణాలు ఆపి అది ప్రభుత్వ స్థలమని సూచించే బోర్డు, ప్రహరీ ఏర్పాటు చేయిస్తామన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కీలక మంత్రి బావమరిది ప్రభుత్వ భూమిని పట్టపగలు కబ్జా చేశారని, పదేళ్లుగా గత ప్రభుత్వంలో లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. 'ధరణి' పేరిట కబ్జా చేసి దోచుకున్న వారి వివరాలు త్వరలో బయటపెడతామని, భూకబ్జా చేసినవారు ఎంతటివారైనా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన భూములు కాపాడేలా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోపే చర్యలు తీసుకుంటామన్నారు.



ఖాజాగూడ కబ్జాపై చర్యలు తీసుకోవాలని నవీన్ మిత్తల్‌ను ఫోన్‌లో ఆదేశిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

120 మాసాలు అధికారంలో ఉండి నెల రోజులకే కొంపమునిగినట్టు మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో వెయ్యి కోట్ల విలువైన 400 ఎకరాల కాందిశీకుల భూమిని గత మంత్రి, ఎమ్మెల్యేలు కబ్జా చేయకుండా అడ్డుకున్నానని తెలిపారు.

కబ్జాపై కదిలారు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఉదయం 10 గంటలకల్లా ప్రాథమిక నివేదిక అందజేయాలని ఆదేశించారు. నల్లగొండలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి.. హైదరాబాద్‌లోని రెవెన్యూ ఉన్నతాధికారుల నుంచి ప్రాథమిక నివేదిక అందిన అనంతరం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కబ్జా బాగోతాన్ని వెలుగులోకి తీసుకొచ్చినట్లు రూఢీ చేసుకున్నారు. నిర్మాణదారులు, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ నుంచే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ యంత్రాంగం పరిశీలన

'ఆంధ్రజ్యోతి' కథనంపై మంత్రి ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఖాజాగూడ పెద్ద చెరువును అనుకొని నిర్మాణం జరుగుతున్న రోడ్డు పనులను, ఆ ప్రాంతాన్ని బుధవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ మల్లయ్యతో పాటు ఇరిగేషన్ ఏఈ నాగరాజు, జీహెచ్ఎంసీ సర్కిల్-20 డిప్యూటీ కమిషనర్ రంజీత్, హైదరాబాద్ మెట్రో అధికారులు సందర్శించారు. దర్గాగా ఘాట్ రోడ్డు తరహాలో సాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంగళవారం రాత్రి వరకు బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లతో పనులు జరగ్గా, బుధవారం ఉదయానికి పనులు ఆగిపోయాయి. అక్కడ బుల్డోజర్లు, ట్రాక్టర్లు, టిప్పర్లు ఏవీ లేవు. చెరువు నుంచి కొండపైకి వేసే రోడ్డులో ముందు భాగంలో ఔట్‌పోస్టు వద్ద సెక్యూరిటీ సిబ్బంది కూడా లేరు. అక్కడి కొండలు, గుట్టలను తవ్విన తీరును పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మల్లయ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రాయదుర్గం పాయ్‌గా సర్వే నెంబర్ 66/1లో 7 ఎకరాలు, 66/2లో 1.20 ఎకరాలు మొత్తం 8.20 ఎకరాల భూమిని ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో పంచనామా చేసి అప్పగించినట్లు తెలిపారు. చెరువు నుంచి గుట్టపైకి రోడ్డు నిర్మాణం ఏ ప్రభుత్వ విభాగం చేపట్టడం లేదని, అక్రమంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అయితే 'ఆంధ్రజ్యోతి'కి కూడా రంగారెడ్డి డీపీఆర్ఓ ద్వారా ఆర్డీఓ లేఖను అందజేశారు. అందులోని వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తాలో సర్వే నెంబర్ 66లో 2009-10 పహణీ ప్రకారం 109.32 ఎకరాల భూమి 'పోరంబోకు' కింద ఉండగా వివిధ సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌కు పంచనామా చేసి అప్పగించిన 8.2 ఎకరాల స్థలంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు నిర్మించడాన్ని గుర్తించినట్లు వివరించారు. అక్రమంగా రోడ్డేసిన వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేశామని, మెట్రో, ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారని తెలిపారు.



రోడ్డు వేస్తున్న చోట ప్రభుత్వ భూమి అంటూ ఏర్పాటు చేసిన బోర్డు; నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కబ్జా బాధ్యులను కప్పిపుచ్చేందుకు తిప్పలు

శేరిలింగంపల్లి మండలంలో కొన్నాళ్లుగా యథేచ్ఛగా సాగుతున్న కబ్జాలపై అధికార యంత్రాంగం తీరు ఆది నుంచి విస్మయానికి గురి చేస్తోంది. తాజాగా ఓ వైపు 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. ఆ వెంటనే మంత్రి ఆదేశాల తోనే ప్రభుత్వ యంత్రాంగం కదిలిందే తప్ప అంతకు ముందు విషయం తెలిసినా రెవెన్యూ, జీహెచ్ఎంసీ యంత్రాంగం ఆ వైపు కన్నెత్తి చూడలేదు. ప్రభుత్వ భూమిలో కొండలను తొలుస్తూ రోడ్డేస్తున్న వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' వారం రోజుల ముందే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, హెచ్ఎంఆర్‌డీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరణ కోరింది. ఆ సందర్భంలో తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతివ్వలేదంటూ అధికారులు చెప్పుకొచ్చారు తప్ప ఎలాంటి చర్యలకూ ఉపక్రమించలేదు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన తర్వాతే రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేశారు. కబ్జా ప్రాంతాన్ని పరిశీలించి అక్కడ ప్రభుత్వ భూమి అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. కబ్జా బాధ్యులను అధికారులెవ్వరూ గుర్తించలేదు. ఆ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు తవ్వకాలు జరిపారనే దాన్ని పరిశీలించారు. తవ్వకాల ఆధారంగా ఏ నిర్మాణ సంస్థ పనులు చేపట్టిందో గుర్తించడం సులువు. కానీ అదేమీ చేయలేదు. పరిసర ప్రాంతాల వారిని అధికారులు కనీసం ఆరా తీయలేదు. కబ్జా బాధ్యులను కప్పిపుచ్చే విధంగా అధికారుల తీరు ఉందని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోడ్డేసేది 'గుర్తు తెలియని' వ్యక్తులట!

ఖాజాగూడ పెద్దచెరువును అనుకొని కొండలు గుట్టలను తొలుస్తూ రోడ్డేయ్యడంపై శేరిలింగంపల్లి ఆర్ఐ బుధవారం సాయంత్రం రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కాపీని అందజేయడానికి రెవెన్యూ అధికారులు ఆసక్తి చూపలేదు. రాయదుర్గం ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. రాయదుర్గం పాన్‌మక్తా సర్వే నెంబర్ 66/1లో ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ శేరిలింగంపల్లి మండల అదనపు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఫిర్యాదు చేశారని, దాంతో కబ్జా చేయడం, పబ్లిక్ ఆస్తులను ధ్వంసం చేయడం లాంటి అంశాల ఆధారంగా 447, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారులు చేసిన ఫిర్యాదులో ప్రభుత్వ భూమిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి రోడ్డేస్తున్నారంటూ పేర్కొనడం గమనార్హం. చెరువు పక్కనే ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి మరీ యథేచ్ఛగా ఘాట్ రోడ్డు తరహాలో పనులు సాగించగా.. కూలీలు గుర్తు తెలియనివారు అయినా.. పనులు చేయించిన సంస్థ గుర్తు తెలియనిది ఎలా అవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొండలు, గుట్టలను తొలిచేసి అక్రమంగా రోడ్డేస్తున్నవారు స్థానికంగా అధికార యంత్రాంగానికి తెలిసినప్పటికీ తెలియదన్నట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వెనుక మాజీ మంత్రి బావమర్ది ప్రమేయం ఉండడంతో వారి పేర్లను చేరిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పడతామని జంకుతున్నట్లు తెలిసింది. అందుకే నిర్మాణ సంస్థ పేరు కానీ, కీలక వ్యక్తుల పేర్లు చేర్చలేదని తెలుస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే విచారణలో వారే బయటపెడతారని భావించినట్లు సమాచారం. ఆది నుంచి రెవెన్యూ అధికారుల తీరు తమ చేతులకు మట్టి అంటకుండా తప్పించుకుంటున్నట్లు ఉండడం గమనార్హం.

చడీచప్పుడు లేని మెట్రో అధికారులు

బయో డైవర్సిటీ సర్కిల్ పక్కనే దాదాపుగా రూ.1,200 కోట్లకు పైగా విలువైన 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని మెట్రో అధికారులకు అప్పగిస్తే వారు కనీసం ఆ వైపు తొంగి చూడలేదు. తమ భూమి అంటూ ఇప్పటి వరకు ఎలాంటి బోర్డు కూడా అక్కడ పాతలేదు. 'కూల్‌గా కబ్జా' కథనం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి మంత్రితో పాటు ఉన్నతాధికారులు స్పందించారు. కానీ సరిగ్గా నాలుగు నెలల క్రితం ఐటీ కారిడార్‌లో గజం రూ.3 లక్షలకు పైగా ధర పలికే ప్రాంతంలో 8.20 ఎకరాల ప్రభుత్వ భూమిని పొందిన హెచ్ఎంఆర్ఎల్ ఉన్నతాధికారులు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఒకరిద్దరు అధికారులను రెవెన్యూ అధికారులకు తోడుగా పంపి చేతులు దులుపుకున్నారు. పంచనామా చేసి హెచ్ఎంఆర్ఎల్ అధికారులకు అప్పగించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా నాటి రంగారెడ్డి కలెక్టర్ నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారుల్లోనే చర్చ నడుస్తోంది. తమకు సంబంధం లేదని రెవెన్యూ, తమకు ఆదేశాలు అందలేదని హెచ్ఎంఆర్ఎల్ దోబూచులాడుతుండగా మధ్యలో సందట్లో సడేమియాలా ప్రముఖ నిర్మాణ సంస్థ దర్జాగా రోడ్డేసుకోవడం విశేషం.

నామినేటెడ్ పదవుల్లో ఆదివాసీలకు ప్రాధాన్యం కల్పించాలి

» ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

» సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, బెల్లయ్యనాయక్, జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ నాయకులకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల నియామకంలో ప్రాధాన్యం కల్పించాలని తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలని సమావేశం తీర్మానం చేసింది. బుధవారం గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేసిన ఆదివాసీ కాంగ్రెస్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులను, కార్యకర్తలను అభినందించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గిరిజన విభాగం కాంగ్రెస్ గెలుపు కోసం గ్రామస్థాయిలో కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకునేలా పాటుపడాలని నాయకులకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర లక్ష్యాలను ప్రతి గిరిజన కుటుంబానికి చేరవేయాలని ఆమె సూచించారు.



ఆదివాసీ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న దీపాదాస్ మున్షీ, రోహిత్, బెల్లయ్య నాయక్, జగ్గారెడ్డి తదితరులు

అభివృద్ధికోసం తండ్లాడి.. ఎన్నికల్లో తడబడ్డాం!

(మొదటిపేజీ తరువాయి)



స్థానం అధికారం నుంచి ప్రతిపక్షానికి మారింది. దీనికి అధైర్య పడాల్సిన అవసరం లేదు. ఓటమి నుంచి తేరుకుని నెలరోజులకే సమీక్ష సమావేశాలను ప్రారంభించాం. ఇది పదకొండో పార్లమెంటరీ స్థాయి సమావేశం. కార్యకర్తల నుంచి విలువైన సూచనలు వచ్చాయి. కార్యకర్తలు కోరుకుంటున్న ప్రకారమే ఇకపై పార్టీ పనిచేస్తుంది. మోసపూరిత హామీలతో గెలిచిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. వాటిని అమలు చేయమని అడిగితే.. కాకమ్మ కథలు చెబుతోంది" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ వరుసగా పదేళ్లు పాలన సాగించడం అరుదని, ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని ఐదేళ్లలోపే ఇంటికి పోయిన కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ దేశంలో ఎక్కువగా ఉన్నాయన్నారు. అరచేతిలో వైకుంఠం చూపేలా కాంగ్రెస్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తెచ్చిందని, హామీల అమలు గడువు ప్రకారం వంద రోజులు కాలేదని ఆగామని, లేకుంటే.. కాంగ్రెస్ సర్కారును చీల్చి, చెండాడే వారిమన్నారు. కర్ణాటకలో ఐదు గ్యారెంటీలకు నిధుల్లేవని ఆ రాష్ట్ర సలహాదారు చెబుతున్నారని, ఇక్కడ కూడా కాంగ్రెస్ నేతలు చావుకబురు చల్లగా చెప్పే రోజులు ఎంతో దూరంలో లేవని జోస్యం చెప్పారు. "ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దావోస్‌కు వెళ్లడమంటే ఖర్చు దండగ అన్నారు. ఇప్పుడేమంటారు? సీఎం బృందం దావోస్‌కు వెళ్లింది. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హత్యారాజకీయాలు మొదలు పెడుతోంది" అని హరీశ్ మండిపడ్డారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌పైనా హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. "కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కేసీఆర్ కొంటారని బండి సంజయ్ చెబుతున్నారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను కూల్చిన, పలు ప్రాంతీయ పార్టీలను చీల్చిన చరిత్ర బీజేపీదే. ఆ విషయాన్ని ఆయన తెలుసుకోవాలి" అని సూచించారు.

కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లే..

అధికారంలో ఉన్నన్ని రోజులు పార్టీ కార్యకర్తలను, ముఖ్య నాయకులు పట్టించుకోనేలేదని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకునేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదని నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ సెగ్మెంట్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఈ సమావేశంలో అభిప్రాయపడ్డారని తెలిసింది. పక్క పార్టీల వల్ల కాకుండా.. సొంత పార్టీ నేతలే ముంచారని ఆరోపించినట్లు సమాచారం. పార్టీ ఓటమికి కారణాలు చెబుతూ.. అధిష్ఠానం తీరుపైనా పలువురు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. "అసంతృప్తి మొదలైనప్పుడే బుజ్జగించి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేది. జూపల్లి కృష్ణారావు లాంటి వారు పార్టీని వీడడం వల్ల నష్టం వాటిల్లింది" అని వారు అభిప్రాయపడ్డట్లు తెలిసింది.

రాష్ట్రం పరువు తీసేలా రేవంత్ వ్యాఖ్యలు

దావోస్ పర్యటనలో ఉన్న సీఎం రేవంతర్ తెలంగాణ గురించి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్రం పరువు తీసేలా ఉన్నాయని బీఆర్ఎస్ నేతలు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, విజయుడు, జైపాల్‌యాదవ్ ఆరోపించారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. విదేశీ పర్యటనల్లో సీఎం అసంబద్ధ వ్యాఖ్యలు చేయడం తగదని, ఇటువంటి పరిస్థితులు ఇకపై రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.

కేసీఆర్ నడుస్తున్నారు...!

'ఎక్స్'లో వీడియో పోస్టు చేసిన ఎంపీ సంతోష్

హైదరాబాద్, జనవరి17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు ఎంపీ సంతోష్ కుమార్ శుభవార్త చెప్పారు. శస్త్ర చికిత్స అనంతరం మాజీ సీఎం కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారని, చేతికర్ర సాయంతో నెమ్మదిగా అడుగులు వేస్తున్నారని తెలిపారు. స్వగృహంలో కేసీఆర్ నడుస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన ఆయన, ప్రతి అడుగు దృఢ సంకల్పంతో వేస్తున్నారని తన ఎక్స్ వేదికలో పేర్కొన్నారు.

డీఎస్సీకి అనుబంధ నోటిఫికేషన్!


(మొదటిపేజీ తరువాయి)

డీఎస్సీ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. కాగా, గత ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌తో టీచర్ పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆ పోస్టులకు సంబంధించి గత ఏడాది నవంబరు 20 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో పరీక్షలను వాయిదా వేశారు. వాటిని మళ్లీ ఎప్పుడు నిర్వహించే అంశాన్ని ప్రకటించలేదు. ఆ తరువాత ప్రభుత్వం మారిపోగా.. కొత్త ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించింది. అయితే పాత నోటిఫికేషన్‌ను రద్దు చేస్తే... సాంకేతికంగా సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా 1.77 లక్షల మంది అభ్యర్థులు ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకున్నందున.. వారి నుంచి ఆందోళన ఎదురవుతుందని భావిస్తున్నారు. ఈ సమస్య రాకుండా గత నోటిఫికేషన్‌కు అనుబంధంగా మరో నోటిఫికేషన్ జారీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఇందులో కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలను పొందుపరిచి, అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి మరో అవకాశం ఇవ్వనున్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం ఉండదు.

విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేకపోయినా..

మెగా డీఎస్సీలో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టుల వరకు ఉండవచ్చని భావిస్తున్నారు. కొత్తగా చేర్చే వాటిలో స్పెషల్ టీచర్ పోస్టులు 1,523 వరకు ఉంటాయి. అదనంగా మరో 4,281 ఖాళీ పోస్టులను గుర్తించారు. వీటితోపాటు మోడల్ స్కూళ్లలో మరో 1,000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించారు. గతంలో పదోన్నతులు కల్పించడం ద్వారా మరికొన్ని పోస్టులు ఖాళీ అయ్యాయి. వాటిని కూడా మెగా డీఎస్సీలో చేర్చనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని కూడా దృష్టిలో ఉంచుకుని టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపడుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా లేదు. అయినప్పటికీ ఇలాంటి పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషనలైజేషన్ ద్వారా ఇలాంటి పాఠశాలల్లోని పోస్టులను రద్దు చేయాలనే ప్రతిపాదన గతంలో ఉండేది. తాజాగా దీనిని ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 26 వేల పాఠశాలలు ఉండగా.. వీటిలో సుమారు 6వేల స్కూళ్లలో ఏకోపాధ్యాయుడే ఉన్నారు. మరో 1,290 పాఠశాలల్లో 'జీరో' అడ్మిషన్లు నమోదయ్యాయి. వీటన్నింటిలో ఖాళీల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితాను రూపొందించి.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఉపాధ్యాయ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనుంది. ఎలాంటి ఇంటర్వ్యూలు లేకుండా పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగానే పోస్టుల భర్తీ జరగనుంది.

ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తాం: కోమటిరెడ్డి



నల్లగొండ: ఫిబ్రవరిలో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గ్రూప్స్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని, గత ప్రభుత్వంలో పేపర్ లీకులు జరిగినట్లుగా కాకుండా యూపీఎస్సీ తరహాలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

ఫిబ్రవరి 11న రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు



కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమి ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఫిబ్రవరి 11న నిర్వహిస్తున్నామని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలో కరాటే పోటీల బ్రోచర్‌ను అకాడమి చైర్మన్ వసంత్‌కుమార్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను ప్రతిష్టాత్మకంగా అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమి చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె.వసంత్‌కుమార్, పుల్లూరి శ్రీనివాస్, బి.ప్రవీణ్‌గౌడ్, తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ నగర కమిటీ నియామకం



రాజశేఖర్ హరీష్

సుభాష్‌నగర్, జనవరి 17: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటి(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నగర కమిటీని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్ నియమించారు. నగర అధ్యక్షుడిగా బత్తుల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ద్యాగతి హరీష్‌లను నియమిస్తూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి విలాసాగరం పృథ్వీ ఉత్తర్వులిచ్చారు.

21 నుంచి కోకో జట్టు శిక్షణ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్ 17: జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న జిల్లా కేంద్రంలో నిర్వహించి ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ పురుషుల కోకో జట్టుకు ఈనెల 21 నుంచి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలంల ఐలాపూర్ గ్రామంలో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నామని జిల్లా కోకో అసోసియేషన్ అధ్యక్షు కార్యదర్శులు నటరాజు రవి, వై మహేందర్‌రావు తెలిపారు. పూర్తి వివరాలకు 9502362184 నంబరులో మంగ సంతోష్ సంప్రదించాలని సూచించారు.

పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలి

హుజూరాబాద్, జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో పెన్షనర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలన్నారు. నూతన పీఆర్సీని 2023నుంచి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మోయిజ్ జహాన్, పి శివరామకృష్ణ, కట్ట నాగభూషణచారి, సమ్మయ్య, వీరస్వామి, మల్లారెడ్డి, చంద్రయ్య, వీరస్వామి, రాజిరెడ్డి, మొగిలయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క జాతరలో షాపుల నిర్వహణకు వేలం

శంకరపట్నం, జనవరి 17: శంకరపట్నం మండలంలోని కేశవపట్నంలో ఫిబ్రవరి 21నుంచి 24వరకు నిర్వహించే సమ్మక్క-సారలమ్మ జాతరలో షాపుల నిర్వహణకు బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈవో మారుతిరావు సమక్షంలో కేశవపట్నం గ్రామపంచాయతీ ఆవరణలో తలనీలాలు, టెంకాయలు, బెల్లం, పుట్నాలు, పేలాలు తదితర షాపుల నిర్వహణకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో బషీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, జాతర నిర్వహణ కమిటీ చైర్మన్ గుర్రం స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్

మానకొండూర్, జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ బుధవారం ముగిసింది. ఆరు గ్యారంటీల అమలు కోసం గత నెల 28 నుంచి ఈ నెల 6వరకు ప్రతి గ్రామంలో అధికారులు రెండు టీంలుగా ఏర్పడి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని 27 గ్రామపంచాయతీలలో అధికారులు స్వీకరించిన 22,573 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు.

ఓడిపోతామనే భయంతో బీజేపీపై బురద

గంగాధర, జనవరి17: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీపై కాంగ్రెస్ నాయకులు బురద జల్లుతున్నారని బీజేపీ చొప్పదండి నియోజకవర్గ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయి కేసీఆర్‌కు సహకరించిన విషయం తెలంగాణ సమాజం మర్చిపోదన్నారు.ఎంపీ బండి సంజయ్‌కుమార్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు.

గురుకులంలో ప్రవేశాలకు గడువు పెంపు

చొప్పదండి, జనవరి 17: తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రవేశాల గడువు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు చొప్పదండి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ వద్ద ఆకట్టుకుంటున్న ఫ్లెక్సీ

● భూసమస్యలు పరిష్కరించబోమని ఏర్పాటు

వీణవంక జనవరి 17: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో భూతగాదాలు, ఆస్తులు, డబ్బుల లావాదేవీ కేసులు పరిష్కారించబోమని ఇటీవల నూతనంగా వచ్చిన ఎస్సై వంశీకృష్ణ ఫ్లెక్సీ ఏర్పాటు ఆకట్టుకుంటోంది. మండలంలోని చాలా భూతగాదా కేసులు ఉండటంతో ఫ్లెక్సీ ఏర్పాటు చర్చనీయాంశంగా మారింది.



పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



బ్యాటింగ్ చేస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్ 17: ప్రస్తుత కాలంలో శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం, ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూనిటీ కప్-2024 క్రికెట్ లీగ్ పోటీలు హోరాహోరీగా జరుగు తున్నాయి. బుధవారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనివాస్‌రెడ్డి బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ క్రికెట్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశ ముందన్నారు. కరీంనగర్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి, నిర్వాహకుడు సురేష్ మాట్లాడుతూ ఈనెల 21న క్వార్టర్స్ సెమీఫైనల్ పోటీలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు నాగులు నర్సింహస్వామి, జిల్లా సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్‌సింగ్, మూరుపాక రాజేశ్ భరద్వాజ్, సుమంత్‌రావు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కాంతయ్య, కృష్ణమోహన్, కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, నిర్వాహకులు ఆమన్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

బ్లాంకెట్లు పంపిణీ

కరీంనగర్ రూరల్, జనవరి 18: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఆధ్వర్యంలో నిరుపేదలకు బ్లాంకెంట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ చైర్మన్ పి.కేశవరెడ్డి, సెక్రెటరీ ఊట్కూరి రాధాకృష్ణరెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి పట్టణంలో రోడ్డుపై టెంట్లు వేసుకుని నివసిస్తున్న పది నిరుపేద కుటుంబాలకు బ్లాంకెట్స్ అందించారు.

20న మెగా జాబ్ మేళా

గణేశ్‌నగర్, జనవరి17: శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో, సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణంలో ఈ నెల 20న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా ఉద్యోగ మేళాలో ఎస్ఎస్‌సి, ఇంటర్, యుజి, పిజి, ఎంబిఎ, ఫార్మసి, బీటెక్ మొదలగు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగ యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ప్రముఖ ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో థ్రెడ్డ్ ఐటి, ఎడుబ్రిడ్జ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, వెటిరో టెక్ సాఫ్ట్ సొల్యూషన్, అపోలో ఎన్‌రైట్స్ మొదలగు 35కు పైగా కంపెనీలు పాల్గొంటున్నట్లు సాహితీ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ రాముల కుమార్ తెలిపారు. తమ ఫౌండేషన్ ద్వారా 10 సంవత్సరాల నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల లో అనేక సామాజిక కార్యక్రమాలు, వృత్తి, నైపుణ్యం పెంపొందించే శిక్షణ కార్యక్రమాలు, మహిళా సాధికారత కార్యక్రమాలు, ప్రముఖంగా మెడికల్ సంబంధిత కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు ప్రముఖంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా పెద్ద ఎత్తున మా వంతుగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అని కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి, కళాశాల ప్రిన్సి పాల్ శ్రీనివాస్, సాహితీ ఫౌండేషన్ చైర్మన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చీఫ్ కో ఆర్డినేటర్ మార్క సంతోష్ కుమార్, శ్రీ చైతన్య డిగ్రీ, పీజీ కళాశాల సిబ్బంది,తదితారులు పాల్గొన్నారు.

23వ సారి యువకుడి రక్తదానం



రక్తదానం చేస్తున్న అంజనేయులు

సుభాష్‌నగర్, జనవరి 17: కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఆశిరి అంజనేయులు 23వ సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాడు. మాజీ ఎమ్మెల్యే బోడిగె శోభ భర్తకు అత్యవసరంగా ఓ నెగిటివ్ రక్తం ఎక్కించాలని డాక్టర్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు వెంటనే బొమ్మకల్ గ్రామానికి చెందిన ఆశిరి అంజనేయులును సంప్రదించగా ఆయన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది తన 23వ రక్తదానం అని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం దొరక్క చాలా మంది ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారని, రక్తదానం చేసి ప్రాణదానం చేయాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

-గన్నేరువరం ఎంపీపీ రాజకీయ కక్ష సాధిస్తున్నాడని ఆరోపణ



పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న గీత

సుభాష్‌నగర్, జనవరి 17: గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి రాజకీయ కక్షతో తన కుటుంబాన్ని వేధింపులకు గురి చేస్తున్నాడని బుధవారం హన్మాజుపల్లి గ్రామానికి చెందిన గీత అనే మహిళ కరీం నగర్ కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం చేసింది. ఎంపీపీ వేధింపులు భరించలేక మంగళవారం తన భర్త సంపత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని ఆమె తెలిపింది. ఆయనను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నామని, ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉందని చెప్పింది. తమ కుటుంబానికి న్యాయం చేయాలని సంపత్ భార్య గీత, కుటుంబ సభ్యులు, పలు వురు హన్మాజుపల్లి గ్రామస్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. గీత తన వెంట తెచ్చుకున్న పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు గమనించి పెట్రోలు బాటిల్‌ను లాక్కొని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'కుట్ర కోణంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుట్ర చేస్తున్నాడంటూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బహిరంగంగా వెల్లడించిన విషయాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి పెంచాల లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో పోలీసు ఉన్నతాధికారులను కోరుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చివేయాలని కేసీఆర్ చేస్తున్న కుట్ర ఆయనకెలా తెలిసిందో సంజయ్ బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.ఏమైనా ఆధారాలుంటే వాటిని పోలీసు అధికారులకు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఈరెండు పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయనే అను మానాలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. ఈకుట్ర కోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అతిథి గృహానికి ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌గా పేరు మార్చాలి



జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి17: కరీంనగర్‌లో నూతనంగా నిర్మించిన అతిథి గృహానికి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా నామకరణం చేయాలని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు డిస్ట్రిక్ రెవెన్యూ ఆఫీసర్ పవన్ కుమార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరీం నగర్ సర్క్యూట్ రెస్ట్‌హౌస్ (కేసీఆర్)గా పేరు పెట్టారని, కానీ గతంలో ఉన్న విధంగానే ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌గా నామకరణం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని రాజకీయ నాయకులు లబ్ధి కోసం నామకరణం చేశారని, పేరును మార్చాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ మహమ్మద్ అమీర్, నాయకులు మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్ పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన



హుజూరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు



జమ్మికుంటలో నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు

హుజూరాబాద్, జనవరి 17: హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపులో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండ-రహదారిపై ధర్నా నిర్వహించారు. డ్రైవర్లకు గులాబీ పువ్వులు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం లారీ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.7లక్షలకు పైగా జరిమానా విధించాలని కేంద్ర ప్రభుత్వం చట్టం తేవడం సరైంది కాదన్నారు. వెంటనే చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎండీ సలీం, మజీత్, జానీ, జగన్నాథం, సజ్జు, రమేష్, తిరుపతి, శంకరయ్య, రషీద్, హరిశంకర్, మోహిని, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) వద్ద లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు బుధవారం నిరసన చేపట్టారు. హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లకు పది సంవత్సరాల జైలు శిక్ష, ఏడు లక్షల జరిమానా విధించడం సరికాదన్నారు. వెంటనే హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

భావితరాలకు అయోధ్య చరిత్రను వివరించాలి

తిమ్మాపూర్, జనవరి17: అయోధ్య రామమందిరం నిర్మాణం కోసం జరిగిన కృషిని భావితరాలకు వివరించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ సామల కిరణ్, విభాగ ప్రచార ప్రముఖ్ శంకరయ్య అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గల ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో తిమ్మాపూర్ ఖండ్‌లో భాగం అయిన తిమ్మాపూర్, చిగురుమామిడి. గన్నేరువరం మండలాల సన్నాహక సమవేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో జరిగే ప్రాణ ప్రతిష్ట ఘట్టం నేపధ్యంలో గ్రామాల్లోని ఆలయాల్లో కార్యక్రమాన్ని వీక్షించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లను వివరించారు. జాగృతి ప్రత్యేక సంచికను ప్రతి ఒక్కరూ చదవాలని సూచించారు. ఈనెల 22న ప్రతి ఇంటిలో ఐదు ఆపైన దీపాలను వెలిగించాలని కోరారు. జిల్లా కార్యావాహ కొండేటి బాలరాజు, సహకార్యవాహ గుత్తికొండ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

హుజూరాబాద్, జనవరి 17: దేశంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా డిజిటల్ స్క్రీన్ ద్వారా మోదీ ప్రభుత్వ హామీలు, పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు పైళ్ల వెంకట్‌రెడ్డి, కేసిరెడ్డి లావణ్య, సుశీల, బల్దియా మేనేజర్ రామోహన్‌రాయ్, ఏఈవో సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల, మెప్మా డీఎంసీ శ్రీవాణి, కార్యక్రమం కో-ఆర్డినేటర్ పల్లెని దేవేందర్‌రావు పాల్గొన్నారు.

జమ్మికుంటలో...

జమ్మికుంట రూరల్ : జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గాంధీ చౌరస్తా సమీపంలో భారత్ వికాస్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని బుధవారం ఘణంగా నిర్వహించారు. బీజేపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్, స్టేట్ బ్యాంక్ మేనేజర్ సోమశేఖర్, మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష్, వైద్యులు అనిత తదితరులు పాల్గొన్నారు.

పారువెల్ల చెరువు నింపేందుకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

గన్నేరువరం, జనవరి 17: మండలంలోని పారువెల్ల గ్రామ చెరువులో నీటిని నింపేందుకు గ్రామ రైతుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో చెరువును నింపేందుకు ఇరిగేషన్ అధికారులు బుధవారం ఎంపీపీ లింగాల మల్లారెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ ఆంజనేయులు మాట్లాడుతూ తోటపల్లికి వెళ్లే ప్రధాన కాలువ నుండి పారువెల్ల గ్రామంలోని పంట పొలాలకు నీరందించే ఉపకాలువలు మధ్యంతరంగా నిలిపివేసిన వాటిని పూర్తిస్థాయిలో నిర్మించుటకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈలు మహేందర్, రాజ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచులు నరసింహారెడ్డి, దుడ్డు రేణుకమల్లేశం, నాయకులు అలువాల కోటి, సంగు వేణు ఉన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

ఈ నెల 31 నుంచి పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జనవరి 17: ఎస్‌యూ పరిధిలోని పీజీ మూడో సెమిస్టర్ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ విద్యార్థులకు ఈనెల 31నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తు న్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వి శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, జనవరి 18: కరీంనగర్ రూరల్ మండలం చర్లబూత్కూర్ గ్రామానికి చెందిన మడ్డి మల్లేశం (48) తాటిచెట్టుపై నుండి గాయాల పాలయ్యాడు. చాతికి, కాళ్లకు గాయాలు కాగ వెన్నెముక విరిగి పోవడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి17: 2024-25 విద్యాసంవత్సరానికి గాను తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లకు 6,7,8వ తరగతుల విద్యార్థులకు మిగిలిన సీట్లకు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో గల ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ, కోర్సుల్లో ఒకేషనల్ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్, టెక్నీషనల్, మొదటి సంవత్సరం సీట్ల కోసం అర్హత ఉన్నవారు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోగలరని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి తెలిపారు. ఫిబ్రవరి6 లోపు ఉచితంగా దరఖాస్తూ చేసుకోగలరని తెలిపారు. ప్రవేశాల్లో 75 శాతం మైనారిటీలకు (ముస్లింలు, క్రిస్టియన్లు, పార్శులు, జైన్స్, సిక్కులు, బుద్ధిస్టులు) 25 శాతం నాన్ మైనారిటీలకు సీట్లు రిజర్వు చేయబడినాయి, తల్లి తండ్రుల వార్షిక ఆదాయం అర్బన్‌లో ప్రాంతాల్లో 2 లక్షల మంది, గ్రామీణ ప్రాంతాల్లో 1,లక్ష 50 వేలకు మించరాదన్నారు. వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి, జిల్లా ప్రాంతీయ సమన్వయాధికారి, పాఠశాలల కళాశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించగలరు. వివరాలకు 8247506232, 9160048786 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం..

గణేశ్‌నగర్, జనవరి 17: జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుచున్న ఇంటర్మీడియట్ చదువుచున్న, ఆ పై చదువులు చదువుచున్న వికలాంగ విద్యార్థిని విద్యార్థులు 2023-24, సంవత్సరమునకు గాను పోస్ట్, మెట్రిక్ స్కాలర్షిప్ కొరకు దరఖాస్తు ఫ్రెష్, రెన్యూవల్స్, చేసుకోవడానికి గడువు 31 జనవరి, 2024 వరకుఉందని అర్హు లైనవారు దరఖాస్తూ చేసుకోగలరని మహిళ, పిల్లల, వికలాంగుల, వయో వృద్ధుల శాఖ జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుచున్న ఇంటర్మీడియట్, ఆపై చదువులు చదువుచున్న వికలాంగ విద్యార్థిని విద్యార్థులు 2023-24 సంవత్సరమునకు జ్ఞిఇట//ృజ్ఞాఙ్మఙ్ముఙ్మిఇటట .ఢిజఙజౌ౨.జీ దరఖాస్తు అను వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోగలరని తెలిపారు. దరఖాస్తు చేసుకొనుటకు చివరి 31జనవరి వారకు వికలాంగ విద్యార్థిని విద్యార్థులు ఇంటర్ ఆ పై చదువులు చదువుచున్న వారు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకొనగలరని తెలియజేయనైనది.

గురుకులంలో ప్రవేశాలకు..

కరీంనగర్ రూరల్, జనవరి 18: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సమత ఒక ప్రటనలో తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరింత సమా చారం కోసం వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

చీకటి పువ్వు నాటికకు ఐదు బహుమతులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా వీరన్నపాలెంలో ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీలలో కరీంనగర్ చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన చీకటి పువ్వు నాటికకు ఐదు బహుమతులు లభించాయి. ఉత్తమ ప్రదర్శన బహుమతి గెలుచుకుంది. ఉత్తమ నటిగా గుడివాడ లహరి, ఉత్తమ సహాయ నటుడిగా దేవుళ్ళపల్లి గిరిబాబు, స్పెషల్ జూరీ బహుమతిగా పరమాత్ముని శివరాం, ఉత్తమ దర్శకుడిగా మంచాల రమేశ్ బహుమతులు గెలుచుకున్నట్లుసంస్థ కార్యనిర్వహక కార్యదర్శి కొత్తకొండ సత్యనారాయణ తెలిపారు.

ఉపసర్పంచ్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

గంగాధర, జనవరి 17: గంగాధర మండలం కొండన్నపల్లి ఉపసర్పంచ్ నిమ్మనవేని ప్రభాకర్‌పై అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. న్యాలకొండన్న పల్లి శివారులోని లింగేశ్వర ఆలయ సమీపంలో కారు లో వచ్చిన ముసుగు వేసుకున్న ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులు రాడ్లతో దాడి చేసినట్లు ప్రభాకర్ తెలిపారు. దాడిలో తలకు, కాళ్లకు, వీపుపై తీవ్రమైన గాయాలు కాగా స్థానికులు కరీంనగర్ వైద్యశాలకు తర లించినట్లు తెలిపారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉపసర్పంచ్ నిమ్మనవేని ప్రభాకర్ తెలిపారు.

బాల కార్మికుల నిర్మూలనకు సహకరించాలి

హుజూరాబాద్, జనవరి 17: బాల కార్మికుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ సంపత్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ఇటుక బట్టీలు, హోటళ్లు, రెస్టారెంట్లలో బాల కార్మికులు పనిచేస్తున్నారనే దానిపై తనిఖీ చేశారు. బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ చందన, రమేష్, ప్రియాంక పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత

వీణవంక జనవరి17: మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన బత్తుల రాజయ్య తన మొబైల్‌ను పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు సీఈఐ ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. ఎస్సై వంశీకృష్ణ రాజయ్యకు మొబైల్‌ను అందజేశారు.

తపాలాశాఖ పథకాలతో ఆర్థిక చేయూత

గంగాధర, జనవరి 17: తపాలాశాఖ ప్రజలకు ఆర్థిక చేయూత నిచ్చే స్కీంలను ప్రవేశపెట్టినట్లు ఆ శాఖ కరీంనగర్ డివిజన్ సూపరింటెండెంట్ శివాజీ అన్నారు. బుధవారం గంగాధరలో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడారు.

● చొప్పదండి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయం లో జరిగిన సదస్సుకు ఎంపీపీ చిలుక రవీందర్, పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ హాజరయ్యారు.

షాదీఖానా నిర్మాణానికి కృషి చేయాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 17 : షాదీఖానా నిర్మాణానికి కృషి చేయాలని మండలంలోని సింగాపూర్ గ్రామంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి వొడితెల ప్రణవ్‌కు మజిద్ అండ్ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ వినతిపత్రం సమర్పించారు.

ఉద్యోగ ఉపాధ్యాయ ఉద్యమ నేతకు సన్మానం

గన్నేరువరం, జనవరి 17: మండలంలోని గుండ్లపల్లిలో బుధవారం టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డిని సర్పంచ్ బేతెల్లి సమత రాజేందర్‌రెడ్డి, టిసిపిఎస్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మాండ్ల భాస్కర్ సన్మానించారు. టిపిఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి పాల్గొన్నారు.